
సాక్షి
పల్నాడు

శనివారం : 26 : ఏప్రిల్ : 2025



అంకమ్మ ఊరేగింపు

చావలి(వేమూరు): గ్రామ దేవత అంకమ్మ ఊరేగింపు శుక్రవారం ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ విఘ్నమొలకల వెంకటేశ్వర్లు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.50 అడుగుల వద్ద ఉంది. ఇది 139.4380 టీఎంసీలకు సమానం.



కారు దగ్ధం

బాపట్ల: మండలంలోని సూర్యలంక వద్ద శుక్రవారం రాత్రి కారు అదుపు తప్పడంతో చెలరేగిన మంటల్లో దగ్ధమైంది. హైదరాబాద్ పర్యాటకులు అప్పటికే సురక్షితంగా దిగారు.

న్యూస్‌రీల్

నేడు ఎస్సీ, ఎస్టీల పీజీఆర్ఎస్

నరసరావుపేట: ప్రతి నెలా నాలుగో శనివారం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను యథావిధిగా శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం వెల్లడించారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

వీర్ల అంకమ్మ కొలుపుల తిరునాళ్ల ప్రారంభం



దాచేపల్లి: వీర్ల అంకమ్మ కొలుపుల తిరునాళ్ల శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. బొడ్రాయికి జలాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

28న మాచర్ల వైస్ చైర్మన్ ఎన్నిక

మాచర్ల: మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 28న కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఈ ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు దీనిని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉండి, తాత్కాలిక చైర్మన్‌గా పని చేసిన మాచర్ల ఏసోబు తన పదవికి మూడు నెలల క్రితం రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. కూటమికి ఒక్క కౌన్సిలర్ కూడా లేరు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు 16 మంది టీడీపీలో చేరారు. మైనార్టీ నాయకుడు షేక్ మదార్ సాహెబ్‌కు వైస్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చేందుకు కూటమి రంగం సిద్ధం చేసింది. మరో ఇద్దరు కౌన్సిలర్లు తాజాగా టీడీపీలో చేరారు.

వాగులో పడి బాలిక మృతి



నూజెండ్ల: ప్రమాదవశాత్తు గుండ్లకమ్మ వాగులో జారి పడి బాలిక మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత ఉప్పలపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చీకటి విజయరాజు, కృపావరం దంపతుల కుమార్తె కీర్తి (10)నాలుగో తరగతి చదువుతోంది. వేసవి సెలవులు కావటంతో సమీపంలోని గుండ్లకమ్మ వాగు వద్దకు ఆడుకుంటూ వెళ్లింది. వాగులో జారిపడి మృతి చెందింది. దుస్తులు ఉతికేందుకు వెళ్లిన స్థానికులు చూసి కన్నవారికి సమాచారం అందించారు. కాళ్లు పూడికలో కూరుకుపోవడంతో చనిపోయి ఉంటుందని తల్లిదండ్రులు చెప్పారు.

ఏఎన్ఎస్‌కు సామగ్రి అందజేత



నరసరావుపేట: యాంటీ నక్సల్స్ స్క్వాడ్ (ఏఎన్ఎస్)లో పనిచేస్తున్న సిబ్బందికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బ్యాగులు, వాటర్ బాటిల్స్, టోపీలు అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, వీఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, ఏఎన్ఎస్ ఆర్ఐ యువరాజు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లో విద్యార్థికి స్థానం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి (రామకృష్ణాపురం) పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఎనిమిదో తరగతి విద్యార్థి ప్రత్తిపాటి అంకిత్ పాల్ గిన్నిస్ బుక్ రికార్డు సొంతం చేసుకున్నాడు. విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్‌లో సంగీతం నేర్చుకొని గతేడాది డిసెంబర్ ఒకటిన 18 దేశాల్లోని 1,046 మందితో కలిసి స్వరాలు ఆలపించి ఈ రికార్డును సొంతం చేసుకున్నాడు. శుక్రవారం గిన్నిస్ బుక్ రికార్డ్ ధ్రువీకరణ పత్రం, పతకాలను విజయవాడలో అందుకున్నాడు. బాలుడి తండ్రి ప్రత్తిపాటి బాబు జె.జె. ట్యూషన్ నిర్వాహకుడు (ఆంగ్ల అధ్యాపకుడు) కాగా, తల్లి వరలక్ష్మి ఉపాధ్యాయురాలు. ఈ సందర్భంగా పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అక్రమాలు అనంతం

కాసులిస్తే.. 'కానిస్టేబుల్'..!

కోడిపందేలు, పేకాట నిర్వాహకుల నుంచి కుటుంబ వివాదాల వరకు సెటిల్‌మెంట్ అతని కనుసన్నల్లో జరగాల్సిందే. అతను చెప్పిందే రేటు. దానికి రూపాయి తగ్గినా కేసులు పెట్టి వేధిస్తాడు. ఐడీ పార్టీ పేరుతో ప్రైవేటు వ్యక్తులతో సైన్యాన్ని ఏర్పాటు చేసి పెత్తనం సాగిస్తున్నాడు. ఇదంతా ఒక కానిస్టేబుల్ చేస్తున్న దందా. ఏకంగా స్టేషన్‌ను తన గుప్పిట్లో పెట్టుకుని అతడు సాగిస్తున్న అనంతమైన అక్రమాల తీరు.



- ఓ కానిస్టేబుల్ అధీనంలో రూరల్ పోలీస్‌స్టేషన్
- పేకాట, కోడి పందేలకు సంబంధించిన వ్యవహారాలన్నీ అతని చేతిలోనే..
- సెటిల్‌మెంట్లు, అక్రమ వసూలుకు ప్రైవేటు మనుషులు
- వసూళ్లలో అధికారులకు అందుతున్న వాటాలు

నరసరావుపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయం ఉన్న రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి స్టేషన్‌ను తన అధీనంలోకి తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్నాడు. కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలంటూ ఒకవైపు జిల్లా పోలీసు అధికారులు ఆదేశిస్తుంటే ఈ స్టేషన్ పరిధిలో మాత్రం ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. 'మాకు మామూళ్లు ఇచ్చి మీరు ఏదైనా చేసుకోండి, స్టేషన్ అధికారులతో నేను మాట్లాడతాను' అంటూ కానిస్టేబుల్ అక్రమార్కులకు అభయమిస్తున్నాడు. దీంతో మూడు ముక్కలు, ఆరు కోళ్లలా రూరల్ పరిధిలో ఈ కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

ఆ అడ్డాలు ఇవే..

కానిస్టేబుల్ పర్యవేక్షణలో రూరల్ ప్రాంతంలో పలు చోట్ల పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇస్సప్పాలెం, ములకలూరులో రెండు ప్రాంతాల్లో, వినుకొండ రోడ్డు ఎస్టీ కాలనీలో పేకాట శిబిరాలు ఏర్పాటు చేశారు. పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లు ఈ శిబిరాల్లో పాల్గొంటున్నారు. అలాగే కేఎం అగ్రహారం, రావిపాడు గ్రామాల మధ్య, లక్ష్మీపురం వద్ద కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. పేకాట, కోడిపందేల నిర్వాహకులతో కానిస్టేబుల్ రేటు మాట్లాడుకొని నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నాడు. స్టేషన్‌లో నమోదు అయ్యే కేసుల సెటిల్‌మెంట్‌ను కూడా కానిస్టేబుల్ చేస్తున్నాడు. ములకలూరుకు చెందిన బాలిక వేరే గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించానని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో యువకుడిని బెదిరించి పెద్ద ఎత్తున నగదు వసూలు చేశాడు.

ప్రైవేటు ఐడీ పార్టీ

కానిస్టేబుల్ తన అక్రమ దందాలో ప్రైవేటు ఐడీ పార్టీని ఏర్పాటు చేసుకున్నాడు. ముగ్గురు యువకులు ఐడీ పార్టీలో సభ్యులుగా ఉండి కానిస్టేబుల్ చేప్పే పనులను చక్కబెడుతున్నారు. కానిస్టేబుల్ చెప్పిన చోటుకు వెళ్లి డబ్బులు వసూలు చేయడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. స్టేషన్ వద్ద వీరు చేసే హడావిడి అంతాఇంతా కాదు. ఫిర్యాదుల నిమిత్తం స్టేషన్‌కు వచ్చే వారితో ముందుగా వీరే మాట్లాడతారు. సమస్య పరిష్కరిస్తామంటూ రేటు మాట్లాడుకొని కానిస్టేబుల్ ద్వారా వ్యవహారం నడిపిస్తున్నారు. దీంతోపాటు ప్రైవేటు సెటిల్‌మెంట్లు డీల్ చేస్తున్నారు. ప్రమాదాల కేసుల్లో వీరి ఆధ్వర్యంలోనే సెటిల్‌మెంట్లు నడుస్తున్నాయి.

అధికారుల పేరుతో వసూలు

కానిస్టేబుల్ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నా స్టేషన్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కానిస్టేబుల్ అక్రమాలలో అధికారులకు కూడా వాటాలు ఉన్నందునే చర్యలకు వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సీఐ, ఎస్ఐలకు ఇవ్వాలని స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, నిందితుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. కేసు తీవ్రతను బట్టి ఎస్ఐ, సీఐల వద్దకు ఫిర్యాదులు కూడా ఇతని కనుసన్నల్లోనే వెళ్తున్నాయి. అధికారులు కూడా సదరు కానిస్టేబుల్‌ను కలవాలని చెబుతున్నట్టు కొందరు బాధితులు వాపోతున్నారు.

గ్రామాల్లో అరాచక పాలన

వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో అభివృద్ధికి బదులు అరాచక పాలన సాగుతోందని పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బడుగు, బలహీన వర్గాలపై, పేదలపై, వైఎస్సార్ సీపీ అభిమానులపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శావల్యాపురం మండలం గంటవారిపాలెంలో ఎస్టీ వర్గానికి చెందిన వారిని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా గుర్తించిన టీడీపీ నాయకులు వేల్పూరు, గంటవారిపాలెంలోని వారి దుకాణాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో పోలీసులు ఎలాంటి కేసులు నమోదు చేయలేదని అన్నారు. మహిళ అని కూడా చూడకుండా ఆమె వస్త్రాలలో దాచిన సెల్‌ఫోన్‌ను సైతం దుర్మార్గంగా లాక్కున్నారని ఆరోపించారు. అలాగే ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో కొండవర్రు నాగేశ్వరరావుపై అక్రమ కేసులు బనాయించి పోలీసులు ఇబ్బందులకు గురిచేశారన్నారు. బొల్లాపల్లి మండలం పలుకూరు తండాలో 65 ఏళ్ల వృద్ధుడిపై, కొచ్చర్ల గ్రామంలో బాలుడిపై దాడి చేశారని చెప్పారు. పోలీసులు కూడా టీడీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు కేబినెట్ హోదాలో చీఫ్ విప్ పదవి వచ్చినప్పుడు వినుకొండ అభివృద్ధి చెందుతుందని అందరూ ఊహించారన్నారు. దానికి భిన్నంగా గ్రామాల్లో అభివృద్ధికి బదులు అరాచక పాలన సాగుతోందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బ్యానర్ కనిపించకుండా చేశారని, గతంలో ఇలాంటి పాలన ఎక్కడా చూడలేదన్నారు. బ్యానర్ కడితే కేసులు, జై జగనన్న అంటే కేసులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని దుయ్యబట్టారు.

చేతనైతే అభివృద్ధి చేయండి...

వినుకొండలో గత ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన అభివృద్ధి పనులైనా చేపట్టాలని జీవీకి బ్రహ్మనాయుడు సూచించారు. వంద పడకల ఆసుపత్రి, ముస్లిం కళాశాల, షాదీఖానా, మున్సిపల్ స్టేడియం, రైతు బజారు, గిరిప్రదక్షిణ రోడ్డు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అరాచక పాలన మానుకోవాలని సూచించారు. కాగా, ఇటీవల జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై పాక్ ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని పొట్టన పెట్టుకున్నారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బొల్లా అన్నారు.

అన్నన్నా... ఇది కన్నారా?



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి వారం చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నామమాత్రంగా సాగుతోంది. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం దీనిని నిర్వహించారు. ఇలాంటి వేదికపై ప్రజలు తమ సమస్యలపై వినతులు అందించడం సర్వసాధారణం. కానీ ఓ వ్యక్తి శుక్రవారం ఎమ్మెల్యేకు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని అందజేశారు. దీని ద్వారా ఏ సమస్య పరిష్కారం అవుతుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే మరి.

– సత్తెనపల్లి

జమ్మూకశ్మీర్‌లో మానవత్వంపై దాడి



చిలకలూరిపేటలో మానవహారంగా ఏర్పడిన ముస్లింలు

- నిరసన కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు
- మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన

చిలకలూరిపేట: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి మానవత్వంపై జరిగినట్టేనని, ఇలాంటి వాటిని సభ్య సమాజం హర్షించదని ముస్లిం జేఏసీ నాయకులు చెప్పారు. పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ, మృతుల ఆత్మ శాంతించాలని కోరుతూ పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో ఉన్న మర్కస్ మసీదు వద్ద శుక్రవారం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ముష్కరుల చేతిలో అమాయక ప్రజలు మృతి చెందడం తీవ్ర విషాదకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ముఫ్తీ అనస్‌ఖాన్, మౌలానా అబ్బాస్‌ఖాన్, షేక్ జాన్‌సైదా, షేక్ అబ్దుల్ జబ్బార్, మొహమ్మద్ యూసుఫ్ అలీ, సీపీఐ సుభాని, షేక్ బాజి, అంజుమన్ అహమ్మద్, సయ్యద్ బడే తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించండి

జిల్లా ఎస్పీ సూచన



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లాలో పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షలో పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల విషయంలో ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. నిర్లక్ష్యంగా స్పందించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. యడ్లపాడు, చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులలో కోర్టు ఈ నెలలో నిందితులకు శిక్షలు విధించినందున సంబంధిత పోలీసు అధికారులను అభినందించారు. అడ్మిన్ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చింతమనేనిపై చంద్రబాబు చర్యలు తీసుకోవాలి

- గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్



నరసరావుపేట: మీడియాపై ప్రజాప్రతినిధులే రౌడీలుగా మారి దాడులు చేయించడం క్షమార్హం కాని నేరమని విశ్రాంత పత్రికా సంపాదకులు, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై ఈ తరహాలో దాడికి పాల్పడిన చింతమనేని ప్రభాకర్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులను కులం పేరుతో దూషించినందుకు, మహిళా ఎమ్మార్వోపై దౌర్జన్యం చేసిన నేరచరిత్ర కలిగిన చింతమనేని తీరును నాడు సభ్యసమాజం తీవ్రంగా నిరసించిందని గుర్తు చేశారు. ఆయన బుద్ధి మార్చుకోలేదంటే కారణం రెడ్ బుక్ రాజ్యాంగం, చంద్రబాబు వత్తాసు కారణాలన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు మేల్కొని, చింతమనేనిని మందలించాలన్నారు.

దూరవిద్యలో ఉత్తీర్ణత దూరం

- గుంటూరు జిల్లాలో 5.86 శాతం నమోదు
- దూరవిద్య టెన్త్ పరీక్షలు రాసిన 939 మంది
- అభ్యర్థుల్లో ఉత్తీర్ణులైన వారు కేవలం 55 మంది
- ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వాకంతో దారుణంగా పడిపోయిన ఉత్తీర్ణత
- కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు సకాలంలో అందని పాఠ్య పుస్తకాలు
- పంపిణీలో తీవ్ర జాప్యంతో తప్పిన విద్యార్థులు



పాత బస్టాండ్ సెంటర్లోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కార్యాలయం

గుంటూరు ఎడ్యుకేషన్ : వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారి కోసం ప్రవేశపెట్టిన దూర విద్యా విధానం సుదూరంగా పోతోంది. సమాజంలో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రవేశపెట్టిన దూర విద్య లక్ష్యానికి చేరలేక పోతోంది. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ద్వారా టెన్త్, ఇంటర్‌లో పెద్ద సంఖ్యలో అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించి, వారికి చదువుకునే అవకాశాలను కల్పించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. బుధవారం రెగ్యులర్ టెన్త్ ఫలితాలతో పాటు ప్రకటించిన దూరవిద్య టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లాలో దారుణమైన ఫలితాలు నమోదయ్యాయి.

ఫలితాల్లో చతికిలపడిన జిల్లా

రెగ్యులర్ టెన్త్ ఫలితాల్లో 88.53 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా దూరవిద్య టెన్త్ ఫలితాల్లో చతికిలపడింది. 5.86 శాతం ఉత్తీర్ణతతో జిల్లా సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. పరీక్షలు రాసిన 939 మంది అభ్యర్థుల్లో కేవలం 55 మందే ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో ఇంతటి దారుణమైన ఫలితాలు నమోదు కావడం ఇదే మొదటిసారి. రాష్ట్రస్థాయిలో దూరవిద్య టెన్త్ ఫలితాల్లో 37.93 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, జిల్లాలో పడిపోయింది.

సొసైటీ నిర్వాకంతో దారుణంగా పడిపోయిన ఉత్తీర్ణత

దూరవిద్య టెన్త్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం పడిపోవడం వెనుక ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వాకమే కారణంగా కనిపిస్తోంది. కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడంలో విఫలమైన అధికారులు, ఉత్తీర్ణతా శాతం దిగజారిపోవడానికి కారకులుగా నిలిచారు. రాష్ట్రంలోని నాలుగైదు జిల్లాలు మినహా, మిగిలిన 20 జిల్లాల్లోనూ ఉత్తీర్ణత కూడా గణనీయంగా పడిపోయింది.

సకాలంలో అందని మెటీరియల్

గుంటూరు కేంద్రంగా ఉన్న ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కార్యాలయం ద్వారా టెన్త్, ఇంటర్‌లో చేరిన అభ్యర్థులకు సకాలంలో మెటీరియల్ అందలేదు. 2024–25 విద్యా సంవత్సరంలో గతేడాది డిసెంబర్ నెలాఖరుకు సైతం పాఠ్య పుస్తకాలు అందలేదు. ఒకవైపు మార్చిలో జరగనున్న పరీక్షలకు ఫీజులు వసూలు చేసిన ఓపెన్ స్కూల్ సొసైటీ తాపీగా పోస్టాఫీసులకు మెటీరియల్ పంపి, చేతులు దులుపుకుంది. గతేడాది డిసెంబరులో గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని పోస్టాఫీసులో జిల్లాలకు పంపేందుకు గుట్టలుగా పడవేసిన మెటీరియల్ పార్శిళ్లు వెలుగు చూశాయి. గతంలో దూరవిద్య టెన్త్, ఇంటర్లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు అక్కడికక్కడే పాఠ్య పుస్తకాలు అందజేసే విధానాన్ని అధికారులు రద్దు చేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి పోస్టల్ ద్వారా పుస్తకాలు పంపే విధానాన్ని ప్రవేశపెట్టడంతో పంపిణీలో నెలకొన్న జాప్యంతో అభ్యర్థులకు శాపంగా మారింది.

విద్యార్థినులకు కలెక్టర్ భరోసా





కోనేటి కావ్యశ్రీ , అంగడి పావని చంద్రిక కుటుంబ సభ్యులతో కలెక్టర్ అరుణ్‌బాబు

కారెంపూడి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన కారెంపూడికి చెందిన కోనేటి కావ్యశ్రీ ఇంటిని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శుక్రవారం సందర్శించారు. కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో చదివిన కావ్యశ్రీ ఇటీవల ఫలితాల్లో 590 మార్కులు సాధించడంతో ఫలితాలు వెలువడిన రోజే బాలిక చదువుకు అన్ని విధాలా సహకరిస్తామని జిల్లా కలెక్టర్ ప్రకటించి, దత్తత తీసుకున్నారు. కావ్యశ్రీ మున్ముందు ఏ కోర్సు చేయాలని భావిస్తున్నదో తెలుసుకునేందుకు కలెక్టర్ స్వయంగా శుక్రవారం విద్యార్థిని ఇంటికొచ్చారు. కావ్యశ్రీ తండ్రి రామయ్య గతంలోనే మృతి చెందగా, తల్లి కోటేశ్వరమ్మ ఉన్నారు. ఆమే ఇద్దరు పిల్లలను కష్టపడి చదివిస్తున్నారు. కావ్యశ్రీ తమ్ముడిని కూడా కలెక్టర్ దగ్గరకు తీసుకుని బాగా చదువుకోవాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యేలా సహకారం

అనంతరం ఒప్పిచర్ల గ్రామానికి కలెక్టర్ చేరుకున్నారు. పదో తరగతిలో 598 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర స్థాయి టాపర్‌గా నిలిచిన అంగడి పావని చంద్రిక ఇంటికి వెళ్లారు. పావనికి అభినందనలు తెలిపారు. ఆమె ఉన్నత చదువుల కోసం ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజా నాయక్ దత్తత తీసుకున్న నేపథ్యంలో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పావని తల్లిదండ్రుల కోరిక మేరకు సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధం అయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ చంద్రకళ, గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు పల్నాడు మహిళలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పదవులు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురు మహిళలను రాష్ట్ర మహిళా విభాగ కమిటీలో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గంగవరపు అనూషకృష్ణను రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శిగా, అల్లం ఇన్నమ్మను రాష్ట్ర మహిళా విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

ఈశ్వర్ కళాశాలకు అటానమస్ గుర్తింపు



నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించినట్టు కళాశాల చైర్మన్ షేక్ మీరావలి తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కళాశాల చైర్మన్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీరావలి మాట్లాడుతూ యూజీసీ నుంచి అటానమస్ హోదా లభించినట్టు వివరించారు. పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కళాశాలను స్థాపించినట్టు తెలిపారు. అటానమస్ గుర్తింపు తమ బాధ్యత మరింత పెంచిందన్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు త్వరితగతిన ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి కేక్ కట్ చేశారు.

సంగీత కార్యక్రమంతో మహిళకు గిన్నిస్‌లో స్థానం

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామ సచివాలయం-1 నందు గ్రామ వ్యవసాయ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న గారపాటి మణిదీప్తి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ (విజయవాడ) వ్యవస్థాపకుడు పాస్టర్ ఆగస్టీన్ దండిగి ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 1న నిర్వహించిన సంగీత పోటీల్లో 18 దేశాలకు చెందిన సుమారు 1,046 మంది సంగీత కళాకారులు ఆన్‌లైన్లో గంటపాటు సంగీత సరళి స్వరాలను కీబోర్డుపై ఆలపించి, వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. అత్యుత్తమ సంగీత స్వరాలను అందించినందుకు మణిదీప్తికి గిన్నిస్ బుక్ వారు సర్టిఫికెట్‌ను, మెడల్‌ను అందించారు.

యార్డులో 1,08,662 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,02,336 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,08,662 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,778 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

అధిక రక్తపోటుతో అనేక అనర్థాలు

- వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు
- బీపీ చెకప్ చేసేందుకు ప్రత్యేక వాహనం ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఆరోగ్య, వైద్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, డాక్టర్ విజయ, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: అధిక రక్తపోటు వల్ల అనేక అనారోగ్య సమస్యలతో పాటు శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతింటాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీస్తున్న అధిక రక్తపోటును ప్రాథమిక దశలోనే గుర్తించి, అదుపులో పెట్టుకోవడం ద్వారా, ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో అధిక రక్తపోటుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది బీపీ, 25 లక్షల మంది షుగర్, బీపీ, షుగర్‌తో 22 లక్షల మంది బాధపడుతున్నట్లు స్క్రీనింగ్ పరీక్షల ద్వారా గుర్తించామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మూడేళ్లుగా రాష్ట్రంలో ఎన్‌సీడీ సర్వేలో భాగంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, జ్వరాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. స్టెమీ కార్యక్రమం ద్వారా ఎనిమిది నెలల్లో 2,300 మందికి రూ. 40వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ చేసి ప్రాణాలు కాపాడామని తెలిపారు. హార్ట్ ఎటాక్ మాదిరిగానే బ్రెయిన్ స్ట్రోక్ కూడా ప్రాణాలు తీస్తుందని, అధిక రక్తపోటును కంట్రోల్‌లో పెట్టుకోవాలని ఆయన సూచించారు.

బస్సు ద్వారా ఉచిత పరీక్షలు

ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ మాట్లాడుతూ చెక్ బీపీ - స్టాప్ స్ట్రోక్ క్యాంపెయిన్ - 2025లో భాగంగా తాము ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి, అన్ని గ్రామాల్లో ఉచితంగా అధిక రక్తపోటు పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. బీపీ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సును, బీపీ అవగాహన పోస్టర్లను కృష్ణబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ ట్రెజరర్ పి.రామచంద్రరాజు, రోటరీ ఇంటర్నేషనల్ రవి వడ్లమాని, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జి.సుబ్బారావు, ఐఎంఏ నేతలు, న్యూరాలజిస్టులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు నిర్వహణపై అసంతృప్తి

అచ్చంపేట: స్థానిక డంపింగ్ యార్డులో జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి శుక్రవారం తనిఖీ చేపట్టారు. వర్మి కంపోస్టు, తడి చెత్త, పొడి చెత్త గ్రేడింగ్ విధానం సరిగా లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఇదే యార్డు ద్వారా పంచాయతీకి జాతీయస్థాయిలో అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. ఇలాగైతే చెత్త నుంచి సంపద సృష్టి ఎలా సాధ్యపడుతుందని అన్నారు. ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచిన యార్డు ఇలా ఉండటం విచారకరమన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ వ్యర్థాల ద్వారా వానపాముల ఎరువు తయారీ, ప్లాస్టిక్ సీసాలు, అట్టముక్కల ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. దీనిపై సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావుకు సూచించారు. జిల్లాలో నాలుగు యార్డులను దత్తత తీసుకున్నానని పేర్కొన్నారు. పంచాయతీని స్వచ్ఛ అచ్చంపేటగా మార్చేందుకు అధికారులు వెంటనే కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పంతులు నాయక్, సర్పంచ్ షేక్ జానీ, వీరబాబు, సిబ్బంది ఉన్నారు.

బాలికల వాలీబాల్ పోటీల విజేత వాల్తేరు





వాల్తేరు, సత్తెనపల్లి జట్లకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రముఖులు

రెండో స్థానంలో నిలిచిన సత్తెనపల్లి జట్టు

సత్తెనపల్లి: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ హైదరాబాద్ 54వ రీజియన్ స్థాయి అండర్-17 బాలికల వాలీబాల్ పోటీల్లో వాల్తేరు జట్టు విజేతగా నిలిచింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని (రామకృష్ణాపురం) పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 8 జట్లు పాల్గొన్నాయి. వాల్తేరు, సత్తెనపల్లి, ఖమ్మం జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. అపూర్వ వైద్యశాల అధినేత డాక్టర్ పాలేటి నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఓటమితో కుంగిపోకుండా సాధన చేసి మరింతగా రాణించాలన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. రిటైర్డ్ పీడీ ఐఎస్ నాగిరెడ్డి, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.కిరణ్ రెడ్డి, రిఫరీలు తదితరులు పాల్గొన్నారు. శనివారం నుంచి 17 బాలుర జట్లు రెండు రోజులపాటు తలపడనున్నాయి.

అద్దంకిలో ఖర్జూరం సాగు



తిమ్మాయపాలెంలో సాగు చేసిన ఖర్జూర తోట

అద్దంకి: జిల్లాలో ఖర్జూరం సాగును రైతులు చేపట్టారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం, చిన్న కొత్తపల్లి గ్రామాల్లో మొత్తం ఐదు ఎకరాల్లో ఖర్జూర పంటను రైతులు సాగు చేశారు. ఈ తోటలు ప్రస్తుతం నాలుగు సంవత్సరాల వయసులో ఉన్నాయి. అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామంలో ఉప్పుటూరి చిరంజీవి అనే రైతు రెండు ఎకరాల్లో బరిహి రకం ఖర్జూరం పంటను, తమిళనాడుకు చెందిన నిజాముద్దీన్ దగ్గర మొక్కను రూ.4500 చొప్పున కొనుగోలు చేసి తెచ్చి సాగు చేశాడు. ఈ తోట నాలుగు సంవత్సరాల వయసులో ఉంది. ఎండలు బాగా కాచి వాతావరణం అనుకూలంగా ఉంటే నాటిన మూడో సంవత్సరం నుంచే కాపుకు వస్తాయి. చెట్టుకు మొదటి సంవత్సరం 20 కిలోలు, రెండో సంవత్సరం 50, మూడో సంవత్సరం 100, అక్కడ నుంచి 300 కిలోల నుంచి 500 కిలోల వంతున 40 సంవత్సరాలపాటు దిగుబడిని ఇస్తాయి. కిలో ధర రూ.150 నుంచి 200 వరకు పలుకుతుంది. ఎకరాకు మొదటి సంవత్సరం రూ.75 వేలు ఆదాయం వస్తుంది.

వ్యయంతో కూడుకున్న పంట..



ఖర్జూర పంట సాగు అత్యధిక వ్యయంతో కూడుకుంది. మొక్క ధరే అధికంగా ఉంటుంది. పూతకు వచ్చిన తరువాత మగ మొక్కల నుంచి పొప్పొడి సేకరించి దాచి ఆడ మొక్కలు పూతపైన చల్లాల్సి ఉంటుంది. ఈ పనంతా చేసుకోగలిగి, ఎండలు బాగా కాచే ప్రాంతాల్లో నాటుకోవచ్చు. -ఉప్పుటూరి చిరంజీవి, రైతు

టీడీపీలో కుమ్ములాట.. ఒకరి ఇంటిపై దాడి

నరసరావుపేటటౌన్: టీడీపీలో అంతర్గత పోరు ఆ పార్టీ వార్డు అధ్యక్షుడి ఇంటిపై దాడికి దారి తీసింది. క్రిష్టియన్ పాలెం 5వ వార్డు టీడీపీ ప్రెసిడెంట్ ఇంటిపై ఆ పార్టీ నేతలు గురువారం అర్ధరాత్రి బీరు సీసాలతో దాడులకు తెగబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగాల వెంకటేశ్వర్లు 5వ వార్డుకు ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కొందరు టీడీపీ నాయకులు గురువారం రాత్రి అతని ఇంటిపై బీరు సీసాలతో దాడి చేశారు. పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసి మీడియాతో మాట్లాడాడు. తాను నిద్రిస్తున్న సమయంలో కొందరు ఇంటిపై బీరు సీసాలతో దాడి చేశారన్నారు. వారంతా టీడీపీ పార్టీకి చెందిన వారేనని తెలిపారు. అర్ధరాత్రి ప్రాణ భయంతో పరుగులు తీయాల్సి వచ్చిందన్నారు. బాధ్యులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి



గాయపడిన శ్రీనివాసరావు

వెల్దుర్తి: పాత కక్షలతో ఓ వ్యక్తిపై మారణాయుధాలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గుండ్లపాడులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావుపై అదే గ్రామానికి చెందిన చిన ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, మరో ఐదుగురే ఈ దాడికి పాల్పడినట్లు బాధితుడి తల్లి అలివేలమ్మ ఫిర్యాదు చేసింది. గాయపడిన శ్రీనివాసరావును మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయమూర్తి ప్రవళికకు సన్మానం



న్యాయమూర్తి ప్రవళికను సన్మానిస్తున్న దృశ్యం

నరసరావుపేట టౌన్: నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవళికను న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. మూడేళ్లుగా సివిల్ జడ్జిగా సేవలందించి ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా పిడుగురాళ్ళకు వెళ్తున్న సందర్భంగా ఈ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో 13 అదనపు జిల్లా న్యాయ అధికారి ఎస్.సత్య శ్రీ మాట్లాడుతూ.. న్యాయశాస్త్ర విద్యాభ్యాసంలో అత్యున్నత ప్రతిభ చాటి బంగారు పతకం సాధించిన ప్రవళిక వ్యక్తిగత జీవితంలో కూడా న్యాయవాదుల ఆదరాభిమానాలను చూరగొన్నారన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి కె. మధు స్వామి మాట్లాడుతూ న్యాయాధికారిగా అన్ని అంశాలకు సంబంధించి అధ్యయనం చేసి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యంత పిన్న వయసులో న్యాయాధికారిగా నరసరావుపేటకు వచ్చి పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించిన ఘనత సాధించారన్నారు. కాగా ఇటీవల నరసరావుపేటలో రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన గాయత్రికి ఘనంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ ఉపాధ్యక్షురాలు అమూల్య, కార్యదర్శి అబ్బూరు ఏడుకొండలు, న్యాయవాదులు కె. విజయకుమార్, బి.సలీం, ఎస్.అయ్యప్పరాజు, సీహెచ్ ఆంజనేయులు, ఎం.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

కవి కత్తి పద్మారావుకు ఘన సన్మానం



పద్మారావు, స్వర్ణకుమారిలను సన్మానించిన రమేష్

పొన్నూరు: పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో దళిత మహాసభ పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ నేతల రమేష్ ఆధ్వర్యంలో కవి డాక్టర్ కత్తి పద్మారావు, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణ కుమారిలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కత్తి పద్మారావు, స్వర్ణ కుమారి అనేక ఉద్యమాలను నీతి, నిజాయతీగా చేసిన త్యాగమూర్తులని కొనియాడారు. కారంచేడు, చుండూరు, పిప్పర, కొత్తకోట, దంతారి, లక్ష్మీపేట వరకు ఎన్నో ఉద్యమాలు చేసిన పోరాట యోధులని పేర్కొన్నారు. దళిత మహాసభ ఆధ్వర్యంలో వారిని సన్మానించడం ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. 1989 ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ తెచ్చిన ఘనత పద్మారావుకే దక్కుతుందన్నారు. దాని వల్ల దళిత బహుజనులకు రక్షణ, సంక్షేమం అందిందని, ప్రత్యేక కోర్టులు ఏర్పడ్డాయని అభినందించారు. కార్యక్రమంలో దళిత మహాసభ ప్రతినిధులు చిగురుపాటి రత్నాకర్‌రావు, నేతలు భలేస్వామి, మాకారపు రాజు, గద్దె అచ్యుతరావు, పీఆర్వోలు గేరా ప్రసన్న కుమారి, శ్యామల, జొన్నలగడ్డ రాణి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనం



కాలిపోయిన వాహనం

నరసరావుపేట టౌన్: ఇంటి బయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు దహనం చేసిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతూరులో నివాసం ఉండే గోగుల శ్రీనివాస్ రోజు మాదిరిగానే తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి బయట నిలిపారు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి కాలిపోయి కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు వాహనంపై పెట్రోలు పోసి తగలబెట్టినట్లు గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ద్విచక్ర వాహనం పక్కనే ఉన్న మరో టీవీఎస్ వాహనానికి కూడా మంటలు వ్యాపించటంతో పాక్షికంగా దెబ్బతింది.

చంద్రబాబు పాపం - విద్యార్థుల పాలిట శాపం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కార్పొరేట్ విద్యా సంస్థల కొమ్ము కాస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరి వల్ల గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలు దిగజారాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవార ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గిందని ఆరోపించారు. నాడు విద్యా సంస్కరణలతో పాటు అమ్మఒడి వంటి అనేక పథకాలతో జగనన్న అత్యుత్తమ ఫలితాలు రాబట్టారని తెలిపారు. నేడు ఆయా పథకాలన్నీ అటకెక్కించి పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారని ఆరోపించారు. 2024లో మొత్తం 2,800 పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. 2025లో అది 1,680 పాఠశాలలకు పడిపోయిందని తెలిపారు. గతంతో పోలిస్తే 5.5 శాతం తక్కువ ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంపై కక్ష, యూపీ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల తొలగింపు వంటి అస్తవ్యస్తమైన నిర్ణయాల వలనే ఫలితాలు దారుణంగా దెబ్బతిన్నాయని తెలిపారు. మరోవైపు గతేడాది సెప్టెంబర్ వరకు టీచర్ల సర్దుబాటు చర్యలతోనే విద్యా సంవత్సరంలో విలువైన సమయమంతా వృథా అయిపోయి ఫలితాలు అడుగంటాయని పేర్కొన్నారు.

ఆద్యంతం నవరసభరితం



జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభిస్తున్న ఎ.వి.బాబురావు, శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

మార్టూరులో రెండవ రోజు అలరించిన పరిషత్తు నాటికలు

మార్టూరు : మార్టూరులో శ్రీకారం రోటరీ కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి ప్రదర్శించిన మూడు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ప్రదర్శనకు ముందు రిలయన్స్ ఫౌండేషన్ ప్రకాశం జిల్లా చైర్మన్ ఏ.వి.బాబూరావు శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభించారు. 'వేదిక' సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ప్రదర్శనలలో పాల్గొన్న నటీనటులకు జ్ఞాపికలు అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన మీనాక్షి సేతురామన్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.వి.సేతురామన్, వసంత సేతురామన్ దంపతులు కళాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జేవీ మోహనరావు, శ్రీకారం కార్యదర్శి జాష్టి అనూరాధ, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, ఈశ్వర ప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య, గరివిడి శ్రీనివాసరావు, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్లీన కోణాలను స్పృశించిన '(అ)సత్యం'

స్వార్థమైనా, నిస్వార్థమైనా, మంచి అయినా, చెడు అయినా, దైవత్వం అయిన, రాక్షసత్వం అయినా ఏదైనా సరే మనిషి హృదయానికి పరిమితమై ఉంటుంది. ప్రతి సత్యం వెనుక లేక అసత్యం వెనుక మనిషి స్వార్థం లేక భయం నిక్షిప్తమై ఉంటుంది. కంటికి కనిపించేదంతా సత్యం కాదు అలాగని కనిపించనిదంతా అసత్యం కూడా కాదు. యదార్థం అయినా సరే ఒక చెడుకు దోహదపడితే అది అసత్యం. అబద్ధమైనా సరే అది ఒక మంచికి దోహదపడితే అది సత్యం. ఏది సత్యం? ఏది అసత్యం? అంటూ ప్రేక్షకులను ఆలోచింపజేసిన నాటిక శ్రీ చైతన్య కళా స్రవంతి ఉక్కునగరం విశాఖ వారి '(అ)సత్యం 'నాటిక. ఎం శ్రీ సుధరచించిన ఈ నాటికకు బి.బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు.

రక్తి కట్టించిన 'జనరల్ బోగీలు' నాటిక

రైలు ప్రయాణం అందరికీ ఇష్టమైనది, సౌకర్యవంతమైనది. అయితే సామాన్యుడి నుంచి సగటు మధ్యతరగతి ప్రజల వరకు రైలులో జనరల్ బోగీలలో తక్కువ ఖర్చు కారణంగా ప్రయాణం చేస్తూ ఉంటారు. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా జనరల్ బోగీలను పెంచాల్సిన రైల్వే శాఖ క్రమేపీ బోగీలను తగ్గిస్తూ ఉండటంతో రైలులోని బాత్‌రూములు, మరుగుదొడ్లలో సైతం ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి ప్రస్తుతం మనం చూస్తున్నాం. తరచూ సంభవించే రైలు ప్రమాదాలలో జనరల్ బోగీలో ప్రయాణించే ప్రయాణికులు మరణించిన సందర్భాలలో వారి చిరునామాలు రైల్వే శాఖ వద్ద ఉండని విషయం కూడా అందరికీ తెలిసిందే. అలాంటి ప్రమాదంలో తన కొడుకును దూరం చేసుకున్న ఓ తల్లి సావిత్రమ్మ రైల్వే శాఖతోపాటు ప్రజాప్రతినిధులకు ఉత్తరాల ఉద్యమం ప్రారంభించి సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపిందన్న ఇతి వృత్తంతో సాగిన నాటిక శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించిన' జనరల్ బోగీలు'. పి.టి.మాధవ్ రచించిన ఈ నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. నాటికలో సావిత్రమ్మ పాత్రధారిగా నటించిన సీనియర్ నటి సురభి ప్రభావతి తన నటనా కౌశలంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

మహిళల మనోగతాలకు దర్పణం పట్టిన 'ఋతువు లేని కాలం'

స్వేచ్ఛ పేరిట ఉమ్మడి కుటుంబ వ్యవస్థలను, పురుషాధిక్యతా శృంఖలాలను తెంచుకుంటున్నామంటూ తమకు తామే బానిసలుగా మారుతున్న నేటి మహిళల పోకడను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన నాటిక కళానికేతన్ వీరన్నపాలెం వారి 'ఋతువులేని కాలం'. అపరిమితమైన ఆర్థిక స్వేచ్ఛతో ఆడంబరాలకు, ఫ్యాషన్లకు బానిసలౌతూ సంస్కృతీ సాంప్రదాయాలకు వక్ర భాష్యం చెప్పడం, మేము అనే భావన నుండి నేను మాత్రమే అనే భావన పెరుగుతూ ఒంటరితనానికి దగ్గరవుతున్న మహిళల అంతరంగాలను ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ప్రదర్శించారు నాటికలోని నటీనటులు.